నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 21 డిసెంబర్ 2023 | MAHABUBNAGAR NARAYANPET

బాదేపల్లి మార్కెట్‌కు భారీగా ధాన్యం

- ఆర్‌ఎన్‌ఆర్‌కు రూ.3,539 పలికిన ధర
- సోనా మసూరికి రూ.2,569, హంసకు రూ.2,669 రాక

జడ్చర్ల, డిసెంబర్ 20 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మళ్లీ ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యానికి ధరలు పెరిగాయి. మంగళవారం క్వింటా రూ.3,331 పలుకగా బుధవారం క్వింటా రూ.3,539 ధర పలికింది. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి అత్యధికంగా క్వింటాకు రూ.3,539 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మార్కెట్‌కు 2,901క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,539, కనిష్ఠంగా రూ.2,501, మధ్యస్తంగా రూ.3,229 పలికింది. మార్కెట్‌కు 444 క్వింటాళ్ల హంసరకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,669, చిట్టిముత్యాలు రకానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.3,567, 27 క్వింటాళ్ల సోనామసూరి రకం ధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,569 ధర పలికింది. అలాగే మార్కెట్‌లో వేరుశనగకు క్వింటాకు గరిష్ఠంగా రూ.7,690, మొక్కజొన్న క్వింటాకు గరిష్ఠంగా రూ.2,273, కనిష్ఠంగా రూ.2,273, మధ్యస్తంగా రూ.2,273 ధర వచ్చింది. అదే విధంగా కందులకు క్వింటాకు గరిష్ఠంగా రూ.8,464, పత్తి క్వింటాకు గరిష్ఠంగా రూ.6,610 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు వెల్లడించారు.

మంత్రులకు ఆహ్వానం

కొండా సురేఖను కలిసిన ఆలయ సిబ్బంది

అలంపూర్, డిసెంబర్ 20 : రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును జోగుళాంబ ఆలయ పాలకమండలి సభ్యులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రులను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అదేవిధంగా ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వచనం చేశారు. వసంత పంచమి రోజున అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుందని ఆ రోజు జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకోవాలని మంత్రులను ఆహ్వానించారు. ముఖ్యంగా రాష్ట్రంలో గల ఏకైక శక్తి పీఠం అలంపూర్ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని మంత్రులను కోరారు. మంత్రులను కలిసిన వారిలో ఆలయ ముఖ్య అర్చకులు ఆనంద్‌శర్మతో పాటు ధర్మకర్తలు ఉన్నారు.

అధికారుల అండదండలు..

రైస్ మిల్లర్లకు సివిల్ సప్లయి అధికారుల నుంచి సహాయసహకారాలు అందుతుండడంతో వారు చెప్పిందే వేదంగా మారింది. నిత్యం కార్యాలయంలో కూర్చొని వారికి అనుకూలమైన మిల్లులకు యాసంగి, వానకాలం వడ్లను కేటాయిస్తున్నారంటే ఇక్కడ వారి ప్రాబల్యం ఎంత ఉందో తెలిసిపోతుంది. గతంలో పీడీఎస్ రీ సైక్లింగ్‌కు సంబంధించి జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తికి చెందిన మిల్లుకు ధాన్యం కేటాయించారంటే అధికారుల పనితీరు ఏంటో అర్థమవుతున్నది. సివిల్ సప్లయ్‌శాఖలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకున్న మిల్లర్లకు రైస్‌మిల్లు లేకున్నా లీజు డాక్యుమెంట్లు పెట్టుకొని రూ.కోట్ల విలువ చేసే సీఎంఆర్ వడ్లకు అధికారులు పర్మిషన్ ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా లీజు తీసుకున్న మిల్లులకు సీఎంఆర్ వడ్లు ఎక్కువగా కేటాయించకూడదు, వడ్లకు సరిపడా షూరిటీ ఉంటేనే ఇవ్వాలి కానీ ఇక్కడి అధికారి మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా ఇష్టారీతిలో వడ్లు కేటాయించినట్లు తెలుస్తున్నది. జిల్లాలో 12 మంది రైస్‌మిల్లర్లు అవినీతికి పాల్పడినట్లు తెలుస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్టాక్ పొజిషన్ లెక్కలపై ఒక కమిటీ వేసి క్షేత్రస్థాయిలో జిల్లాలోని అన్ని మిల్లులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేస్తే మరిన్ని మిల్లుల బాగోతం బయటపడే అవకాశం ఉన్నది.

మిల్లులపై దాడులు..

హైదరాబాద్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మే నెలలో జిల్లాలోని మూడు రైస్ మిల్లులపై దాడులు నిర్వహించారు. అయిజలోని అన్నపూర్ణ మిల్లుకు 60.24 ఏసీకేలు, గద్వాల మండలం కాకులారంలో ఉన్న కృష్ణారైస్ మిల్లుకు 28.69 ఏసీకేలు, వడ్డేపల్లి మండలంలోని సూర్యట్రేడర్స్ మిల్లుకు 36.82 ఏసీకేలు కేటాయించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేసే సమయానికి ఈ మొత్తం వడ్లకు సంబంధించి కేవలం 16.02 ఏసీకేల బియ్యాన్ని మాత్రమే అప్పగించారు. అందుకు సంబంధించిన ధాన్యం మిల్లులో నిల్వ ఉండాలి. కానీ అన్నపూర్ణ, కృష్ణా మిల్లుల్లో మిగతా ధాన్యం మాయమైంది. తనిఖీ సమయంలో అన్నపూర్ణ మిల్లులో కేవలం 1,716 బస్తాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కృష్ణా మిల్లులో ధాన్యం నిల్వ లేకపోవడంతో ఈ రెండు మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేశారు. వీటితోపాటు అయిజలోని శ్రీనివాస రైస్‌మిల్లు, కేటీదొడ్డి మండలంలో నందిన్నె గ్రామ శివారులో ఉన్న మిల్లులో అధికారులు దాడులు చేశారు. అయితే ముందస్తు సమాచారం అందుకున్న యజమానులు మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులతో పాత ధాన్యం అని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చెప్పించి కేసులు నమోదు కాకుండా చేశారు.

అధికారులు దాడులు చేసి కేసు నమోదు చేసిన రైస్‌మిల్లు

జోగుళాంబ గద్వాల జిల్లాలోని రైస్‌మిల్లులోత నిఖీలు చేపడుతున్నఎన్ ఫోర్స్‌మెంట్‌అధి కారులు(ఫైల్)

కేసులు సరే.. రికవరీ ఏది?

- మిల్లర్లకు ఉన్నతాధికారి అండదండలు
- రూ.10 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం మాయం
- పీడీ యాక్ట్ నమోదు చేయాలన్న మంత్రి ఆదేశాలు బేఖాతరు

గద్వాల, డిసెంబర్ 20 : జోగుళాంబ గద్వాల జిల్లా సివిల్ సప్లయ్ శాఖ కార్యాలయంలో పనిచేసే ఉన్నతాధికారి అండదండలు మిల్లర్లకు ఉండడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. మిల్లర్లు చెప్పిన వారికే ధాన్యం కేటాయించడం మొదలు.. తప్పు చేసిన వారిని రక్షించే వరకు సహకరిస్తుండడంతో జిల్లాలో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే ధాన్యం మాయమైంది. ఈ విషయం జిల్లా సివిల్ సప్లయ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదు. దీంతో ఆరోపణలు వచ్చిన మిల్లులపై ఈ ఏడాది మే నెలలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేయగా అసలు విషయం బయటకు వచ్చింది. పేదలకు ఆహార భద్రత పథకం కింద పంపిణీ చేసేందుకుగానూ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వడం కోసం రైస్ మిల్లర్లకు ప్రభుత్వం ధాన్యం అప్పగిస్తుంటుంది. అయితే, ఆ ధాన్యాన్ని కొందరు మిల్లర్లు అమ్ముకోవడంతోపాటు రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్ భర్తీ చేస్తున్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఓ ముఠానే కొలువుదీరింది. వారు రేషన్ బియ్యా న్ని సేకరించి మిల్లర్లకు ఇస్తున్నట్లు సమాచారం. నలుగురు మిల్లర్లు నిత్యం డీఎస్‌వో కార్యాలయంలో పైరవీలు చేసుకుంటూ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. వాళ్లు చెప్పిం దే డీఎస్‌వోకు వేదం. ముఠా అక్రమాలపై వివరణ అడిగేందుకు వెళ్లిన పాత్రికేయులపై ఆ అధికారి చిందులు తొక్కడం పరిపాటిగా మారింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 2021-22 వానకాలం, యాసంగికి సంబంధించి మిల్లర్లు 19,106 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉన్నది. కానీ ఇప్పటివరకు 10,491 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. 2022-2023 వానకాలం సీజన్‌లో 28,904 మెట్రిక్ టన్నులకు గానూ 19,978 మెట్రిక్ టన్నులు ఇవ్వగా.. 5,662 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉన్నది. 2022-2023 యాసంగికి సంబంధించి 24,684 మెట్రిక్ టన్నులకు గానూ ఇప్పటి వరకు 1,131 టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. గడువు ముగిసినా మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. 2022-23 వానకాలానికి సంబంధించి 34 మిల్లులకు ధాన్యం కేటాయించగా.. వారి నుంచి డిసెంబర్ 12వ తేదీ నాటికి కేవలం 5 శాతం బియ్యం మాత్రమే సేకరించినట్లు అధికారులే చెప్పడం విశేషం. గడువు సమీపిస్తున్నా పెండిం గ్ ధాన్యం డెలివరీ చేయడంలేదు. అయితే, కొందరు మిల్లర్లు ఈ వడ్లను అమ్ముకొని సొ మ్ము చేసుకున్నట్లు తెలిసింది. జిల్లాలోని మూడు మిల్లుల్లో సుమారు 108 ఏసీకేలు (ఒక ఏసీకేకు 290 క్వింటాళ్లు) అమ్ముకొని రూ. 10కోట్ల మేర కూడబెట్టుకున్నట్లు సమాచారం. అధికారులకు మామూళ్లు ముట్టడంతో ఈ విషయం గురించి అస్సలు ఆలోచించడం లేదనే ఆరోపణలు వినిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మిల్లులపై దాడులు చేసి ఏడు నెలలు కావస్తున్నా ఫలితం లేదు. సివిల్ సప్లయ్ శాఖ అధికారులు కేసులతో చేతులు దులుపుకున్నారే తప్పా రికవరీ చేయలేదు. ఇటీవల ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో సమీక్ష నిర్వహించి సీఎంఆర్ ధాన్యం పక్కదారిపై ఆరా తీశారు. సంబంధిత శాఖ అధికారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అక్రమాలకు బలం చేకూరింది. ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా వడ్లను అమ్ముకున్న వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మంత్రి ఆదేశాలు బేఖాతరు చేస్తూ ఎటువంటి కేసులు నమోదు చేయకపోవడం విశేషం.

- జోగుళాంబ గద్వాల జిల్లాలో డీఎస్‌వో ఇష్టారాజ్యం
- రేషన్ బియ్యం రీసైక్లింగ్‌లో మిల్లర్ల మాయాజాలం
- వారు ఆడిందే ఆట.. పాడిందే పాట
- లీజు పేరుతో తప్పించుకుంటున్న అసలు సూత్రదారులు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో బయటపడుతున్న అక్రమాలు

మూడు రాష్ట్రాలకు రవాణా సేవలు మెరుగు

- ఏపీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- రూ.42 కోట్లతో తుంగభద్ర నదిపై నిర్మించిన నాగల్‌దిన్నె వంతెన ప్రారంభం
- పాల్గొన్న అలంపూర్, ఎమ్మిగనూర్ ఎమ్మెల్యేలు విజయుడు, చెన్నకేశవరెడ్డి

అయిజ, డిసెంబర్ 20 : తుంగభద్ర నదిపై నిర్మించిన నాగల్‌దిన్నె వంతెనతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు రవాణా పరంగా సేవలు మెరుగుపడతాయని ఏపీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మిగనూర్ నియోజకవర్గంలోని నందవరం మండలం, నాగల్‌దిన్నె సమీపంలోని తుంగభద్ర నదిపై రూ. 42కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెనను అలంపూర్, ఎమ్మిగనూర్ ఎమ్మెల్యేలు విజయుడు, ఎర్రకోట చెన్నకేశవరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. మూడు రాష్ట్రాల ప్రజల రాకపోకలకు కీలకమైన వారధి నాగల్‌దిన్నె వంతెన అని పేర్కొన్నారు. 2009అక్టోబర్ 2న తుంగభద్ర నదికి వచ్చిన జల ప్రళయానికి నాగల్‌దిన్నె వంతెన పూర్తిగా నేలమట్టమైందన్నారు. 2011లోనే అప్పటి సమైక్య ప్రభుత్వం కొత్త వంతెన నిర్మాణానికి రూ.42కోట్లు విడుదల చేసిందన్నారు. అనేక కారణాలతో బ్రిడ్జి నిర్మాణం పనులు కొన్ని అవాంతరాల వల్ల ఆలస్యమైనప్పటికీ సీఎం జగన్మోహన్‌రెడ్డితో ఎమ్మిగనూర్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వంతెన పనులను పూర్తి చేయించాలని పట్టుదలతో కృషి చేస్తూ నిధుల విడుదలకు చర్యలు తీసుకొని పనులు పూర్తి చేసి నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణకు సహకరించడంతో పనులు వేగిరంగా పూర్తి చేసి, మూడు రాష్ట్రాల ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నాగల్‌దిన్నె వారధితో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు రవాణా పరంగా అభివృద్ధి చెందుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని బీటీ రోడ్డు ఆధునీకరిస్తున్నట్లు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. అయిజ నుంచి నాగల్‌దిన్నె వంతెన వరకు బీటీ రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని ఏపీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి వివరించారు. అంతకు ముందు మంత్రి బుగ్గన, ఎమ్మెల్యేలతో శాస్త్రోక్తంగా పూజలు చేయించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్నూల్ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూల్ కలెక్టర్ గుమ్మళ్ల సృజన, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నేత అగస్త్యరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన,ఎమ్మెల్యేలువిజ యుడు,చెన్నకేశవరెడ్డి

ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి

దేవరకద్రలో నిరసన తెలుపుతున్న ఆటో, జీపు డ్రైవర్లు

దేవరకద్ర, డిసెంబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న మహిళలకు ఉచిత ప్రయాణ నిర్ణయంతో ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డు పడ్డాయని వీరగురు ఆటో యూనియన్ మండల గౌరవాధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, మండలాధ్యక్షుడు రాము ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆటో యూనియన్ నాయకులు ఆటోలు బంద్ చేసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల కుటుంబాలకు ప్రతి నెలా రూ.20వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, జీపు అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్‌లో ..

రాజాపూర్, డిసెంబర్ 20 : ఆటోలు నడుపుతూ జీవనోపాధి పొందుతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం అదుకోవాలని ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు తిరుపతయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల సామాన్య ఆటో డ్రైవర్ల బతుకు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని, లేదా నెలకు రూ.20 వేల జీవన భృతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు నర్సింహులు, మారుతి, హైమద్, సత్యం, పాషా, బారీ తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్‌లో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆదిశిలా క్షేత్రం దినదినాభివృద్ధి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- ఆలయంలో అన్నదాన సత్రం, ఆలయ ముఖద్వారం ప్రారంభం

మల్దకల్, డిసెంబర్ 20 : ఆదిశిలా క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూగా వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన అన్నదాన సత్రం, ఆలయ ముఖ్య ద్వారాలను బుధవారం తంబిహళ్లి మఠం పీఠాధిపతి విద్యాసింధు మాధవస్వామితో కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్లకు ఆలయ కమిటీ చైర్మన్‌తోపాటు ఈవోలు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను స్వామీజీ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. బిజ్వారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సత్యారెడ్డి, సతీమణి మాణిక్యమ్మ దంపతులు, ఆలయ ఆవరణలో భక్తుల భోజన సౌకర్యం కోసం రూ.18 లక్షలతో అన్నదాన సత్రాన్ని నిర్మించారు. అలాగే ఆలయ ముఖ్య ద్వారాలకు టేకు తలుపులు గద్వాల పట్టణానికి చెందిన బాణాల పుష్పవతి శేషఫణి దంపతులు రూ.9 లక్షలతో చేయించారు. నాలుగో ద్వారాన్ని శాంతినగర్‌కు చెందిన శివశివాని పాఠశాల కరస్పాండెంట్ ఈశ్వరీశ్యాంసుందర్ రూ.9లక్షలతో నిర్మించారు. ఆలయ ఆవరణలో రూ.10 లక్షలతో నిర్మించిన రేకుల షెడ్డును మండలకేంద్రానికి చెందిన కటికె సుశీలాబాయికృష్ణాజీరావు దంపతులు నిర్మించారు. ఆలయ ఆవరణలో ముసల్‌గౌడ్ దంపతులు రూ.5 లక్షలతో టైల్స్ వేసి ఆలయ అభివృద్ధికి సహకరించగా స్వామిజీతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి దాతలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్దకల్ తిమ్మప్పక్షేత్రం దినదినాభివృద్ధి చెందుతుందని, భక్తులు విరివిగా విరాళాలు ఇచ్చి స్వామి వారి కోసం వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు కల్పించడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. అలాగే ఆలయాభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి, విక్రం సింహారెడ్డి, అరవిందరావు, బాబురావు, మల్లికార్జున్‌రెడ్డి, నాగరాజుశర్మ, వెంకోబరావు, చంద్రశేఖర్‌రావు, నాయికి మధు, నరేందర్, అర్చకులు మధుసూదనాచారి, ధీరేంద్ర దాస్, శశాంకాదాస్, రమేశ్‌చారి, రవిచారితోపాటు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మల్దకల్ ఆలయ ముఖ ద్వారాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీకేఎంఆర్, స్వామీజీ

ప్రజలకు అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం, డిసెంబర్ 20 : పదవిలో ఉన్నా లేకున్నా నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నెల్విడితండాలో తుల్జాభవానీ మాతకు విశిష్ట పూజలు నిర్వహించారు. తండావాసుల పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే ఆల ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో దురదృష్టవశాత్తు కొద్ది ఓట్లతో ఓడిపోవడం జరిగిందని, ఎవరూ అధైర్యం చెందొద్దన్నారు. వచ్చే ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు జయంతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదగిరి, యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూజలకు హాజరైనఆ లవెం కటోశ్వర్‌రెడ్డి

కొనగట్టుపల్లిని సందర్శించిన తమిళ నాడు ప్రజాప్రతినిధులు

హన్వాడ, డిసెంబర్ 20 : మండలంలోని కొనగట్టుపల్లికి సామాజిక భద్రత పంచాయతీ కింద జాతీయ స్థాయిలో అవార్డు వచ్చిన సందర్భంగా బుధవారం తమిళనాడుకు చెందిన పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు పల్లెప్రగతి, శ్మశానవాటిక, డంపింగ్ యార్డు తదితర వాటిని పరిశీలించారు. ప్రతి వార్డును పర్యవేక్షించడంతోపాటు ప్రతి ఇంటి వద్ద నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలను పరిశీలించి పలు విషయాలను ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన మొక్కలు, ప్రతి ఇంటి వద్ద నాటిన మొక్కలను, ప్రకృతి వనాన్ని పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మానస గ్రామంలో ప్రతిఒక్కరి సహకారంతో జాతీయ స్థాయి అవార్డును అందుకున్నామని, గ్రామాభివృద్ధి కోసం రూ.కోటి నిధులు మంజూరయ్యాయని వివరించారు. అనంతరం తమిళనాడుకు చెందిన ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, డీపీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, ఈవోపీఆర్‌డీ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనగట్టుపల్లిని సందర్శించిన తమిళనాడు ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం

ఇసుక టిప్పర్ల పట్టివేత

దేవరకద్ర, డిసెంబర్ 20 : దేవరకద్ర మండలంలోని గూరకొండ, పెద్ద రాజమూర్ గ్రామాల సమీపంలో కొంతమంది ఇసుక అక్రమార్కులు ఉదయం, రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. వాగు సమీపంలోని పంట పొలాల్లో భద్రపరుస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి పూట టిప్పర్ల ద్వారా హైదరాబాద్, మహబూబ్‌నగర్, దేవరకద్ర వంటి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో వాగు సమీపంలోని బోరు బావుల్లో భూగర్భ జలాలు తగ్గిపోతాయని రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో.. కొంత మంది రైతులు ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకొని పోలీసులకుఅ ప్పజెప్పారు.

జూరాలకు స్వల్ప వరద

ధరూర్, డిసెంబర్ 20 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువనుంచి వరద కొనసాగుతున్నది. బుధవారం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 506 క్యూసెక్కులు చేరుతుండగా అవుట్‌ఫ్లో 66 క్యూసెక్కులుగా నమోదైంది. పూర్తిస్థాయి నీటిమట్టం 7.759 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 4.052 టీఎంసీలునీటి మట్టం నిల్వ ఉన్నట్లుఅ ధికారులు తెలిపారు.

డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని మార్చాలి

- మరికల్‌లో డిగ్రీ విద్యార్థుల ధర్నా
- గంటన్నర ఆలస్యంగా పరీక్షలు
- కేంద్రాన్ని పరిశీలించిన యూనివర్సిటీ అధికారులు

అధికారులకు వినతి అందజేస్తున్న విద్యార్థి నాయకులు

మరికల్, డిసెంబర్ 20 : మరికల్‌లోని సరస్వతీ డిగ్రీ కళాశాలలో మక్తల్‌కు చెందిన అయ్యప్ప డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ పరీక్షలు రాస్తున్నారు. మక్తల్, మాగనూర్ నుంచి పరీక్షలు రాసేందుకు మరికల్ రావడం ఇబ్బందిగా ఉందని మరికల్‌లోని పరీక్షా కేంద్రాన్ని మార్చాలని బుధవారం డిగ్రీ విద్యార్థులు పరీక్షా కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. పరీక్షలు రాయాలని పీయూ అధికారులు వచ్చిమీ సమస్యకు పరిష్కారం చెబుతారని కళాశాల యాజమాన్యం, పోలీసులు నచ్చజెప్పినా విద్యార్థులు వినిపించుకోలేదు. మక్తల్ నుంచి అయ్యప్ప డిగ్రీ కళాశాల యాజమాన్యం వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పడంతో గంటన్న ఆలస్యంగా పరీక్షలు నిర్వహించారు. అనంతరం పరీక్షా కేంద్రాన్ని పీయూ ఏఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల విభాగం అధికారులు రాజ్‌కుమార్, కుమారస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్తల్ నుంచి అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో మరికల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇప్పటికిప్పుడు పరీక్షా కేంద్రాలను మార్చడం కుదరదని చెప్పారు. మక్తల్‌లో డిగ్రీ కళాశాల నిర్వహిస్తే అక్కడికి పరీక్షా కేంద్రం మారుస్తామని ప్రకటించారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

మరికల్, డిసెంబర్ 20 : మరికల్‌లోని సరస్వతీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో మాగనూర్‌కు చెందిన విద్యార్థి ఆంజనేయులు మంగళవారం మాస్‌కాపీయింగ్‌కు పాల్పడినట్లు గుర్తించిన స్క్వాడ్ ఆ విద్యార్థిని డీబార్ చేశారు. అవమానంగా భావించిన ఆంజనేయులు మాగనూరు పరిసర ప్రాంతాల్లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పీయూ అధికారులకు వినతి అ